జ్ఞాన్ పోస్టు ద్వారా పుస్తక రవాణా

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

దేశవ్యాప్తంగా ఉన్న పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు తదితర మెటీరియల్స్‌ను అతి తక్కువ ధరలకు పంపించే సౌకర్యాన్ని భారత తపాలా శాఖ జ్ఞాన్ పోస్ట్ అనే నూతన సేవను మేడే నుండి అందుబాటులోకి తెచ్చిందని పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగాల కోసం ప్రయత్నించేవారు అతి తక్కువ ధరలతో పుస్తకాలు, విద్య సంబంధిత సామగ్రిని భారతదేశంలో ఎక్కడి నుండి ఎక్కడి వరకైనా పంపి కొనవచ్చునని చెప్పారు. పార్వతీపురం పోస్టల్ డివిజన్ పరిధిలో గల అన్ని పోస్ట్ ఆఫీస్ లోను ఈ జ్ఞాన్ సేవలు వినియోగించుకోవచ్చునని అన్నారు.

పార్వతీపురం, బలిజిపేటలో అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అవినాష్

మేడే స్ఫూర్తితో

మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను కాపాడుకోవాలని, కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం మేడే స్ఫూర్తితో పోరాడాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. దేశంలో మతోన్మాదం, ఉగ్రవాదం, శ్రమదోపిడీని అరికట్టేందుకు పోరాటాలే మార్గమని అన్నారు. మేడే సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా వాడవాడలా మేడే వేడుకలను కార్మిక సంఘాల నాయకులు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ, పలు గ్రామాల్లో మేడే జెండాను ఎగురవేసి కార్మిక హక్కుల రక్షణకు ప్రతిన బూనారు

లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరు

- 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు పిలుపు
- సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పాత బస్టాండు, బెలగాం, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో 12 చోట్ల సిఐటియు జెండాలను నాయకులు ఆవిష్కరించి, పాత బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఆర్టీసీ కళాశాల యూనియన్, ఆటో కార్మికుల యూనియన్, రైస్ మిల్లర్ కళాసీ సంఘం సభ్యులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. బెలగాంలో గల సుందరయ్య భవనం వద్ద జిల్లా ప్రజాశక్తి బాధ్యులు, విలేకరులు జెండాను ఆవిష్కరించారు. సిఐటియు ఆధ్వర్యంలో శ్రామిక మహిళా నాయకులు బి లక్ష్మి, నాయకులు బంకురు సూరిబాబు, పట్టణ అంగన్‌వాడీ సెక్టార్ 1, 2 లీడర్లు, కార్యకర్తలు, హెల్పర్లు మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, బివి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడులి తదితరులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నేడు కార్మికులు, ఉద్యోగులు తమ హక్కుల సాధనకు, భవిష్యత్తు పోరాటాలకు నాంది పలుకుతూ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ప్రపంచ కార్మిక దినం మేడే ఆవిర్భావం గురించి కార్మికులకు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు ఆనాటి ప్రజా పోరాటాలకు తలొగ్గి కార్మికులకు అనుకూలమైన చట్టాలు తెచ్చి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయడం ప్రారంభించారని గుర్తు చేశారు. నేటి పాలకులు అప్పటి త్యాగాల ఫలితంగా ఏర్పడిన కార్మిక చట్టాలను కూడా రద్దుచేసి మళ్లీ పనిగంటలు పెంచేందుకు, ఉద్యోగ భద్రత లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, ఈ కుట్రలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం "మేడే" స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో 48 కార్మిక చట్టాలను రాజ్యాంగంలో పొందుపరిస్తే ఆ చట్టాలన్నిటిని రద్దు చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని ఈ ప్రయత్నాన్ని కార్మిక వర్గం ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా మే 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయడం ద్వారా కార్మిక, కర్షక ఐక్యత ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, శ్రామిక మహిళా సంఘం నాయకులు బి.లక్ష్మి, మున్సిపల్ యూనియన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, నాగవంశం మల్లేష్, నాగవంశం శంకరరావు, మామిడి శివ, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి కష్ణ, పి లక్ష్మణ, ఆటో యూనియన్ నాయకులు, శంకర్రావు ,మల్లేష్ సింహాచలం, ఆర్టీసీ కళాసీ యూనియన్ నాయకులు అప్పలనాయుడు భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : పట్టణంలో మేడేను పురస్కరించుకుని సిఐటియు, యుటిఎఫ్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి, అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. గాంధీనగర్ జంక్షన్ నుండి సిఐటియు సీనియర్ సభ్యులు వైకుంఠపు రామకృష్ణ, మున్సిపల్ కార్యాలయం వద్ద సీనియర్ సభ్యుడు బంగారు సత్యం, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం శివాజీ వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం రాజేశ్వరరావు పార్కు నుంచి డీలక్స్ థియేటర్ మీదుగా బోసుబొమ్మ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు. మాట్లాడుతూ నరేంద్ర మోడీ లేబర్ కోడ్ రద్దుచేసి కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలు వెంటనే నిలిపి వేయాలని లేకుంటే ఢిల్లీ తరహాలో గతంలో జరిగిన పోరాటాల ద్వారానే మోడీకి బుద్ధి చెప్పే దానికి కార్మిక వర్గం సిద్ధపడుతుందని హెచ్చరించారు. ఇందులో భాగంగానే మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె అనంతరం పెద్దఎత్తున పోరాటాలకి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు టి.శంకర్రావు, సాలూరు కమిటీ అధ్యక్షులు రాముడు, మీడియా కన్వీనర్ రవి, శ్రీను, మహిళా నాయకులు లక్ష్మి, కొత్తమ్మ, పర్మినెంట్ కార్మిక సంఘం నాయకులు వెంకట్రావు.తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం మే జెండాను సిఐటియు సీనియర్ జి.సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాదిం చుకున్న హక్కులన్నింటిని కుదించి 4 కోడ్‌లుగా మార్పుచేశారని, దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడుతూనే ఉందన్నారు. మే డే స్ఫూర్తితో మే 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ సమ్మెలు జయప్రదం చేయాలని పిలుపుఇనాచ్చరు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు దాలమ్మ, సావిత్రి, అప్పారావు, భానుమూర్తి, త్రినాధ్, బలరాం నాయుడు, నల్ల ఈశ్వరరావు, లక్ష్మి, వెన్నెల వేణు, పైల సత్యనారాయణ, సుబ్బయ్య, చక్రి, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

సాలూరులో మేడే సందర్భంగా కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఎన్‌వై నాయుడు

నేడు మన్యం బంద్

జయప్రదానికి ఆదివాసీ గిరిజన సంఘం పిలుపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో శుక్రవారం చేపట్టబోయే మన్యం బంద్‌కు రిక్షా కార్మిక, ఆటో వర్కర్లు , వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ పిలుపునిచ్చారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో బంద్ పై గురువారం సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల భాగంగా మెగా డీఎస్సీ పేరుతో 16 వేల42 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. అయితే ఇచ్చిన హామీలో భాగంగా జీవో 3కు చట్టబద్ధత కల్పించకుండా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడంతో గిరిజన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు కేవలం 42 పోస్టులు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. జిఒ 3 వల్ల ఆదివాసీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల్లో న్యాయం జరిగేదని అన్నారు. మెగా డిఎస్సీ నుంచి ఆదివాసీ ప్రాంత పోస్టులు మినహాయించాలని, ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పై సమస్యలపై ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, నాయకులు బిడ్డక అడిత్తు, పాండురంగారావు, బిడ్డిక సత్యం, సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ నెల 10న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ వాయిదా పడిందని రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సాధికారత కమిటి అధ్యక్షులు ఎస్. దామోదరరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు వాయిదా వేశామన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జులై 5న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలు పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, ఇతర వివాదాలను పరిష్కరించడానికి లోక్ అదాలత్ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగేకన్నా కేసులను పరిష్కరించుకోవడమే మిన్న అని, రాజీ చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గుతాయని, ప్రశాంతత లభిస్తుందని అన్నారు. లోక్ అదాలత్ లో బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్క కక్షిదారుడు వినియోగించుకుని లబ్ది పొందాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో గల 4 ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటిడిఎ ఇన్‌ఛార్జి ఇఒ ఎస్ఎస్ శోబిక ఒక ప్రకటనలో తెలిపారు. 7,8,9 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 11లోగా సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లకు దరఖాస్తు అందజేయాలని కోరారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, అనసబద్ర, కొటికపెంట పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఈనెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నటు

11న ఏకలవ్య ప్రవేశ పరీక్ష

మక్కువ: మండలంలోని అనస భద్ర ఏకలవ్య పాఠశాలలో 7, 8, 9 తరగతిలో ఖాళీగా ఉన్న 11 సీట్లకు గానూ ఈనెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ బి.ఎర్రునాయుడు తెలిపారు.

సాగుకు ముందస్తు ప్రణాళికలు

నవధాన్య విత్తన కిట్లు అందుబాటులో ఉంచాలి

జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్

ప్రజావక్తి - గరుగుబిల్లి

పంటల సాగుకు ముందస్తు ప్రణాళికలు రైతులకు ఎంతో అవసరమని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన కార్యాలయ ప్రాంగణంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ఖరీఫ్ పంటల ప్రణాళిక తయారీ, నవ ధాన్యాల సాగుపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించడంతో పాటు, ప్రకృతిని, భూమిని పరిరక్షించుకోవడం మన బాధ్యతన్నారు. రుతుపవనాల ఆగమనానికి ముందే 30 రకాల పంటలను, విత్తనాలను కలిపి వేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు రైతులకు కలుగుతాయన్నారు. ఇందుకోసం జిల్లాలోని ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద నవ ధాన్యాలు కిట్లును రైతులకు అందుబాటులో ఉంచాలని, నవ ధాన్యాలు సాగు చేసే రైతులు విస్తీర్ణం ఇ క్రాప్ బుకింగ్ చేయడం జరుగుతుందని, జిల్లాలోని వ్యవసాయ అనుబంధ సంస్థల సమన్వయంతో కలిసి పనిచేయడం వల్ల రైతులు ఆర్థికంగా లబ్ది పొందుతారన్నారని అన్నారు. అలాగే డిపిఎం పి.షణ్ముఖ రాజు మాట్లాడుతూ రైతుల భూముల్లో మట్టి నమూనా పరీక్షలు కార్యకర్తల సహకారంతో చేసుకోవడం వల్ల తక్కువగా ఉన్న పోషకాలు గుర్తించడం, నివారణా చర్యలు వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. రీజినల్ టెక్నికల్ అధికారి జి.హేమ సుందర్ ప్రకృతి వ్యవసాయం చేయని గ్రామాల్లోనూ రైతు సేవా కేంద్రం వద్ద నవ ధాన్యాలు కిట్లును సిద్ధం చేయాలని, రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకునేలా కార్యకర్తలు అందుబాటులో ఉండాలని అన్నారు. 365 రోజులు భూమి పై పంటలు పండించుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రేగిడి విజయ భారతి, జట్టు సంస్థ డైరెక్టర్ ప్రహరాజ్, రైతు సాధికార సంస్థ ప్రతినిధి బి.భాను, రాజారావు, ఎన్ఎఫ్ఎలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

నేరగాళ్లు అరెస్టు

రూ.90వేలు స్వాధీనం • మూడు సెల్‌ఫోన్లు సీజ్

ప్రజాశక్తి- పాలకొండ

వివిధ ప్రదేశాల్లో సెల్ ఫోన్లు దొంగలించి అందులో ఉన్న ఫోన్ల ద్వారా డబ్బులు కాజేసిన నేరగాళ్లను పోలీసులు గురు వారం పట్టుకున్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో డిఎస్‌పి ఎం.రాంబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గతేడాది నవంబర్ 20న భామిని మండలం వడ్డంగికి చెందిన బి.నారాయణరావు పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి శ్రీకాకుళం వెళ్లేందుకు సిద్ధమవుతుండగా సెల్ఫోన్ కొంతమంది వ్యక్తులు దొంగలించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఏప్రిల్ 21న పాలకొండ గాయత్రి నగర్ చెందిన ఒక వ్యక్తి దగ్గర నుంచి కాంప్లెక్స్ దగ్గర కొంతమంది వ్యక్తులు సెల్ ఫోను దొంగలించారు. అయితే ఆ ఫోన్ ద్వారా ఫోన్ పే నగదును వేరే ఫోన్‌కు పంపించారుజ రూ. 90 వేల 200 ఫోన్పే ద్వారా వేరే ఫోన్‌కు పంపించారు. దీనిపై సిఐ ఎం.చంద్రమౌళి సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. సిసి పుటేజ్‌లతో పాటు ఫోన్ పే నెంబర్ల ద్వారా నిందితులను గుర్తించారు. పశ్చిమగోదావరి చెందిన మేకల వెంకటేష్, మహమ్మద్ బాషాతో పాటు విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన గోపీచంద్ నేరం చేసినట్లు గుర్తించారు. వీరు మారుమూల ప్రాంతాల్లో కాంప్లెక్స్ సమీపంలో మాటవేసి ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. మేకల వెంకటేష్ అత్తవారి ఊరు విజయనగరం కావడంతో గోపీచంద్ పరిచయమై అత్తవారింటికి వచ్చాక పథకాన్ని రచించి ఈ దొంగతనాలకు పాల్పడినట్లు తెలుస్తుంది. నిందితుల నుంచి మూడు సెల్ ఫోన్లతో పాటు రూ.90 వేల 200 నగదును స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో సిఐ ఎం.చంద్రమౌళి, ఎస్.ప్రయోగమూర్తి ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి రాంబాబు

ఐఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

దోమల నివారణకు చేపడుతున్న ఐఆర్ఎస్ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. గురువారం ప్రారంభమైన ఐఆర్ఎస్ కార్యక్రమాన్ని ఎఎంఒ డి.సూర్యనారాయణ తో కలిసి అడారు పంచాయతీలో గల గేదెగుమ్మివలసలో వైద్య సిబ్బంది నిర్వహించిన స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇంటింటికీ దోమల మందు పిచికారీ చేస్తున్న తీరును దగ్గరుండి గమనించారు. ఇళ్లల్లో గల అన్ని గదుల్లోనూ పిచికారీ జరగాలని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పిచికారీ పూర్తయిన ఇళ్లకు మార్కింగ్ తప్పనిసరిగా వేయాలని సిబ్బందికి సూచించారు. స్ప్రేయింగ్ చేపడుతున్న సిబ్బంది ఐఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేస్తున్నదీ దగ్గరుండి పరిశీలించారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ గ్రామస్తులతో మాట్లాడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.కౌశిక్, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ, ఎంటిఎస్ రామకృష్ణ, సూపర్వైజర్ కష్ణంరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పేర్కొన్నారు. స్థానిక ఆర్‌సిఎం కార్యాలయ సముదాయ ఆవరణలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ప్రాథమిక, ఉన్నత పాఠశాల స్థాయి వేసవి శిక్షణా తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. చదువులో మొదటి స్థానం నిలిచిన విధంగానే క్రీడల్లో కూడా జిల్లా ఖ్యాతిని ఇనుమడించాలని ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యం పెంపొందించుకొనేందుకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, క్రమశిక్షణ, ఏకాగ్రతకు తోడ్పాటునిస్తాయన్నారు. పిల్లలు ఎంచుకున్న రంగంలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. క్రీడాకారులు ఆసక్తి కలిగిన క్రీడా విభాగంలో కఠోర సాధనతో శ్రమించి లక్ష్యాన్ని సాధించాలన్నారు. శిక్షకుల ద్వారా మెళుకువలు తర్ఫీదు పొంది అత్యుత్తమ ప్రతిభను చూపాలని సూచించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో క్రీడాకారులు ప్రదర్శించిన క్రీడలను తిలకించారు. వేసవి క్రీడా శిక్షణా శిబిరానికి క్రీడా సామాగ్రిని ఎమ్మెల్యే శిక్షకులకు అందజేశారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో క్రీడా మౌలిక సదుపాయాలు కలిగిన 50 కేంద్రాల వద్ద 18 క్రీడా అంశాలలో అథ్లెటిక్-5, ఆర్చరీ-3, బాస్కెట్ బాల్-1, బ్యాడ్మింటన్ 5, బాక్సింగ్ -2, క్రికెట్-1, చెస్-1, ఫెన్సింగ్-1, హ్యాండ్ బాల్-3, హాకీ-1, కబడ్డీ-3, ఖోఖో-1, కిక్ బాక్సింగ్-1, కరాటే-6, టైక్వాండో-3, స్టాఫ్ బాల్ 1, వాలీ బాల్-8, యోగా- 4 నైపుణ్యం కలిగిన శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులతో తర్ఫీదు ఇవ్వనున్నట్లు వివరించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా క్రీడా శిక్షణ శిబిరాల వద్ద ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్స్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమలో డిఇఒ రమాదేవి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎం.మురళీకృష్ణ, అంతర్జాతీయ బాక్సర్, అర్జున్ అవార్డు గ్రహీత సీరా జయరాం, ఆర్చరీ జిల్లా కార్యదర్శి డిటి గాంధీ, పిఇటిలు, పీడీలు, క్రీడాకారులు, తదితరులు, పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

నర్సిపురంలో...

మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవిల్లో విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని, ఆసక్తిని పెంచుకునేందుకుగాను వేసవి క్రీడా శిక్షణ తరగతులను మాజీ వైస్ ఎంపీపీ గొట్టాపు గౌరి ప్రారంభించారు. ఈ శిక్షణా శిబిరంలో చదరంగం సాఫ్ట్‌బాల్, వాలీబాల్‌లో శిక్షణ ఉంటుందని పాఠశాల పిడి సుబ్బాన మురళీ తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు స్నాక్స్ నిమిత్తం గ్రామానికి చెందిన పెద్దలు నాలుగువేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

సీతంపేట : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు ఐటిడిఎ ఆధ్వర్యంలో గురువారం క్రీడల వేసవి శిక్షణ శిబిరాలు గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఐటిడిఎ క్రీడా పర్యవేక్షణ అధికారి ఎన్ జాకబ్ దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ శిక్షణా తరగతులు నెలరోజుల పాటు జరుగుతాయన్నారు. బాస్కెట్ బాల్,హాకీ, ఎథలిటిక్స్, బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో శిక్షణలో ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటికి శిక్షకులుగా ఎస్.ఈశ్వరరావు, ఎం.దిలీప్, రాజేష్, రమేష్ నిర్వహిస్తారన్నారు. ఈ శిక్షణా శిబిరాలు సీతంపేట ఐటిడిఎకు సంబంధించిన గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోనూ, పాలకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, భామినిలోని మోడల్ పాఠశాల భామినిలో క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున విద్యార్థులు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏజెన్సీలో వడగళ్ల వాన

పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం ఏజన్సీలో గురువారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. రాత్రి 7.30గంటల నుంచి 9గంటల వరకూ ఏకధాటిగా వర్షం కురిసింది. ఈదురు గాలలకు చెట్లు కొమ్మలు విరిగి విద్యుత్ తీగెలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా కాయగా, రాత్రి అకస్మాత్తుగా భారీ కురిసింది. కురుపాం పట్టణంలోని వీధుల కాలువల్లో పొంగిపొర్లడంతో వాహనచోదకులకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ వర్షం ఆరుతడి పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీరఘట్టం మండలంలోని గురువారం రాత్రి కుండ పోతవర్షం కురిసింది. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ సమయంలో వర్షం కురవడంతో కొంతమేర ఊరట ఇచ్చిందని, మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీరఘట్టంలో గత కొంతకాలం నుండి కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో వర్షపు నీరు అంతా రోడ్డుపై ప్రవహించింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కురుపాంలో కురుస్తున్న భారీ వర్షం

సీతానగరం: ర్యాలీ చేస్తున్న కార్మికులు, నాయకులు

రెపరెపలాడిన ఎర్ర జెండా

కార్మికుల దీక్షా దినమైన మేడే వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్ని మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ఎర్రజెండా రెపరెపలాడింది. సిఐటియుతో పాటు ఇతర కార్మికసంఘాలు కూడా మేడే పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా పలు చోట్ల ర్యాలీలు, సభలు జరిగాయి. కార్మిక హక్కుల రక్షణ కోసం ప్రతిన బూనారు.

పాలకొండ : పట్టణ, మండల కేంద్రాల్లో మే డే జెండా ఆవిష్కరణలు, ర్యాలీ, సమావేశాలు సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దావాల రమణారావు ఆధ్వర్యాన సోషలిజం వర్ధిల్లాలని, సామ్రాజ్య వాదం నశించాలని, కార్మిక వర్గం, అంతర్జాతీయ వాదం వర్ధిల్లాలంటూ ప్రతిజ్ఞ చేశారు. పాలకొండ పట్టణం, మండల కేంద్రం తదితర గ్రామాలు నివాస ప్రాంతాల్లోనూ మేడే జెండాను ఆవిష్కరించారు. శ్రీ కోట దుర్గ మార్కెట్ కళాసీ యూనియన్, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఆటో వర్కర్స్ యూనియన్, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలోనూ, తమటపల్లి, గొట్టమంగలాపురం తదితర ప్రాంతాల్లో మే జెండను ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు సిఐటియు మండల అధ్యక్షులు బి అమరవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అర్జమూడి లక్ష్మణరావు, ఎన్.హిమప్రభ, జి.శ్రీనివాస్, జి.శారద, ఎం.శ్యామల, మణి, శ్రీదేవి, కె.శారద, కె.గౌరీశ్వరి, జాగా గోవిందరావు, సిహెచ్ సంజీవి, పడాల వేణు, గేదెల సత్యం, వై.సింహాచలం, జి.శ్రీరాములు, ఆర్.వెంకటరమణ, ఎ.ఈశ్వరరావు, మజ్జి వీరనాయుడు, బబ్బాది శివ, కాదా రామ తదితరులు నాయకత్వం వహించారు.

మక్కువ : మండలంలో కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై అన్ని రంగాల కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జరిగిన మేడే కార్యక్రమంలో సిఐటియు సీనియర్ సభ్యులు ఎల్. దాలమ్మ జండా ఆవిష్కరణ చేయగా జి కష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ప్రజా సంఘాల నాయకులు పద్మసాంబశివ తాడంగి ప్రభాకర్ రావు, సీత, పవన్, అలెఖ్య తదితరులు పాల్గొన్నారు.

జియమ్మవలస : మండల కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి. సరళ కుమారి మేడే జెండా ఆవిష్కరించారు. మే 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు, కర్షకులు జయప్రదం చేయడం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కూరంగి సీతారాం, మండల అధ్యక్షులు వెంకట రత్నం, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

కురుపాం : ప్రపంచ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని కార్మికుల యొక్క హక్కులు సాధనకు ఉద్యమించడానికి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి అన్నారు. కురుపాంలో గల రావాడజంక్షన్‌లో అంగన్వాడీ కార్యకర్తలు, కార్మికులు ఆధ్వర్యాన మేడే వేడుకల్లో ఆమె జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.శ్రీనివాసరావు, అంగన్వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు జె. సరోజ, రాధాకుమారి, సూర్య కుమారి, శోభ, వసంత రాణి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : సిఐటియు ఆధ్వర్యంలో మేడే కార్మికుల దినోత్సవ సందర్భంగా కొమరాడ మండల కేంద్రంలో కార్మికుల ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కొమరాడ ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సిరికి అనురాధ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గండి జగన్నాథం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు గిరిజన సంఘం నాయకులు మధు, సిహెచ్‌డబ్ల్యు యూనియన్ నాయకులు దుర్గ, విఒఎ నాయకులు ఎ.భవాని, మధ్యాహ్న భోజన కార్మికుల నాయకులు నరసమ్మ, ఆటో యూనియన్ నాయకుల అప్పలనాయుడు, తోపుడుబండ్ల నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు లలిత, మంగ, గంగేశ్వరమ్మ, రాజేశ్వరి, భవాని పాల్గొన్నారు.

సీతంపేట: మేడే వేడుకలు సిఐటియు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సిఐటియు కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.తిరుపతిరావు, ఎ.భాస్కరరావు, అంజలి, పార్వతీ, దర్శమ్మ, మాలతి, రొయ్యబారు, రాజేంద్ర తదితరులు పాల్గొని మాట్లాడారు.

గరుగుబిల్లి: నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయం ఆవరణంలో మేడే జెండాను సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, బిడ్డిక అడిత్తు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కస్తూరి, గిరిజన సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని వివిధ రంగాల కార్మికులతో కలిసి సిఐటియు జెండాను జిల్లా కార్యదర్శి బివి రమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దాసరి వెంకటనాయుడు, నాయకులు కలిశెట్టి జగ్గారావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బాబురావు, విశ్వేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు సావిత్రి, కృష్ణవేణి, పద్మావతి, అరుణకుమారి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కరణం రవీంద్ర, రెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

వీరఘట్టం : స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా నాయకులు ఎన్.సింహాచలం ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత సిఐటియు జెండాను ఎగురవేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు సిహెచ్ భాగ్యలక్ష్మి, వై ప్రసాద్, పి.ప్రసాద్, రాజు, తదితర కార్మికులు పాల్గొన్నారు. అలాగే స్థానిక బస్టాండ్‌లోనే ఆటో వర్కర్ యూనియన్ కోశాధికారి ఎస్.రామకృష్ణ జెండాను ఆవిష్కరించారు. సిపిఐ ఎంఎల్ జిల్లా సీనియర్ నాయకులు భాస్కరరావు జెండాను ఆవిష్కరించారు.

గుమ్మలక్ష్మీపురం : అరుణపతాకాన్ని ఆవిష్కరిస్తున్న మండంగి రమణ

ఇఫ్టూ ఆధ్వర్యాన

పార్వతీపురం: మేడే సందర్భంగా ఇఫ్టూ అనుబంధ వర్తక కళాసీ సంఘం ఆధ్వర్యాన కార్మికులు ర్యాలీ నిర్వహించారు. బెలగాం నుంచి వర్తక కళాసీ సంఘం కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. పట్టణంలో మూడు కేంద్రాల్లో జెండా ఎగురవేశారు. ముందుగా బెలగాం అగ్రహారం వీధి సెంటరులో వున్న జెండా దిమ్మ వద్ద డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, వర్తక కళాసీసంఘం భవనం వద్ద పి.రమణి, బందం వారి వీధిలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు గేదెల సర్వేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం బందవారి వీధిలో జి.సర్వేశ్వరరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో రెడ్‌క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు, ప్రముఖ కథా రచయిత గంటేడ గౌర్నాయుడు, ప్రముఖ కవి సిరికి స్వామి నాయుడు, సిపిఐ(యం యస్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పోల ఈశ్వరరావు, పిఒడబ్ల్యు నాయకులు రమణి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయుకులు పిళ్లా లక్ష్మణరావు, అరుణోదయ నాయుకులు జయలక్ష్మి దుష్యంతు తదితరులు మాట్లాడారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన

సాలూరు : స్థానిక ఆర్టీసీ డిపోలో మేడే దినోత్సవాన్ని ఎపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి జె.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు డిఇ రావు మే జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంనకు జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.త్రినాథ్, డిపో ప్రెసిడెంట్ టి.ఆర్.బాబు, డిపో కోశాధికారి వై.రవిరాజు, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ డిఎస్ రావు, అరుణకుమారి, ఎ.కుసుమ, డిపో మహిళా నాయకులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట: మండల కేంద్రంలో శ్రామిక మహిళా నాయకులు కొత్తకోట పార్వతీదేవి ఆధ్వర్యంలో మేడే జెండాని పాత బస్టాండ్ వద్ద ఆవిష్కరించారు. ఆటో కార్మిక సంఘం నాయకులు పి రమేష్ అధ్యక్షతన మేడే జెండాను ఎగరవేశారు. పనుకువలసలో ఎన్ బంగారమ్మ శ్రామిక మహిళా నాయకులు ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరించారు. పాంచాలి ఆటో స్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో శ్రామిక మహిళా నేత పి.నాగవేణి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు మహిళలు, ఆటో కార్మికులు, భవన కార్మికులు పాల్గొన్నారు.

సీతంపేట: ర్యాలీ చేస్తున్న కార్మికులు

సీతానగరం: మేడే సందర్భంగా గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నుంచి మెయిన్ రోడ్డు మీదగా సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు తమ హక్కుల సాధనకు భవిష్యత్తు పోరాటాలకు నాంది పలుకుతూ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతిలక్ష్మి, శ్రామిక మహిళా నాయుకులు వెన్నెల రామలక్ష్మి, మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాకులు సంఘం జిల్లా కార్యదర్శి వై శాంతి కుమారి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాము, గ్రీన్ అంబాసిడర్ యూనియన్ నాయకులు జలుమూరు గౌరీ, తోలాపు రమేష్, ఆర్.శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎఐటియుసి పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక మార్కెట్ యార్డ్, పార్వతీపురం లారీ అసోసియేషన్, జిల్లా ఆసుపత్రి వద్ద జండా ఆవిష్కరణ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో సిపిఐ ఎంఎల్ ఆర్గనైజింగ్ నాయకులు బొత్స నర్సింగరావు ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సింహాద్రి దుర్గారావు, కె.గోపినాయుడు, రాగోలు ప్రసాద్, బత్తుల రమేష్, టి.గౌరీ శంకర్రావు, జి. ఆదినారాయణ, బాబూరావు, జగదీష్, సిరిపురపు తాతబాబు, హమాలీలు, శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బంది చంద్రమౌళి, శంకర్రావు, కుమారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: జెండా ఎగురవేస్తున్న సిఐటియు నాయకులు సాంబమూర్తి

పాలకొండ: ర్యాలీ చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

జియ్యమ్మవలస: మాట్లాడుతున్న అంగన్వాడీ నాయకులు సరళ

పాచిపెంట: నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

కురుపాం: మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఉమామహేశ్వరి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మక్కువ, మావుడి, ఎర్రసైమంతవలస ఫీడర్ల పరిధిలోని ట్రీ కటింగ్ చేపడుతున్న సందర్భంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డిఇఇ కె.గోపాలరావు నాయుడు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న మహిళలు

ప్రభుత్వ స్థలంలో భవన నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పాచిపెంట

మండల కేంద్రం ధనాన వీధిలో ప్రభుత్వ స్థలంలో భవన నిర్మాణం చేయడంపై మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తూ తహశీల్దార్ డి. రవికి గురువారం వినతి పత్రం అందజేశారు. స్థానిక దనాన వీధిలో ఆ వీధికి చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రభుత్వ స్థలం ఆక్రమించి భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో తమకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలుపుదల చేశారని మళ్లీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారని పనులు నిలుపుదల చేయాలని తహశీల్దారును కోరారు. ఆ స్థలం గ్రామ కంఠం పరిధిలోకి వస్తుందని నిర్మాణం చేపడుతున్న వారికి నోటీసులు జారీ చేస్తామని తహశీల్దార్ మహిళలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

కాశీవిశ్వనాథేశ్వర విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని ఇప్పలవలస శ్మశానవాటికలో శ్రీకాశీ విశ్వనాథేశ్వర విగ్రాహాన్ని గ్రామానికి చెందిన డోకల భాస్కర్ రావు గురువారం ప్రతిష్ఠించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన భార్య చిన్నతల్లి జ్ఞాపకార్థం ఈ విగ్రహాన్ని ఆవిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పదో తరగతి శిక్షణ కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని పదో తరగతి తప్పిన విద్యార్థుల శిక్షణ కేంద్రాన్ని ఐటిడిఎ ఉప విద్యాశాఖ అధికారి కె.రవి ప్రసన్నకుమార్ సందర్శించారు. విద్యార్థులు ఈ శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. డిడిఇఒతో పాటు ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట ఎంపిడిఒగా ప్రసాద్

ప్రజాశక్తి- పాచిపెంట

మండల ఎంపిడిఒ ఎంఎల్ఎన్.ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఎఒ బివిజె పాత్రో ఆధ్వర్యంలో సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. సీతానగరం మండలం నుండి ఇక్కడికి ఈయన బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పాచిపెంట మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం బీజేపురం, శిఖబడి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి గురువారం పరామర్శిoచారు. ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి శశికళ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న పుష్పశ్రీవాణి

నాటుసారా స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అక్రమ మద్యం తయారీ యూనిట్లపై అంతర్‌రాష్ట్ర సమన్వయంతో పెద్ద ఎత్తున దాడి నిర్వహించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు తెలిపారు. అక్రమ మద్యం తయారీకి వ్యతిరేకంగా నిరంతరం చర్యలు తీసుకుంటున్న ఎక్సైజ్ శాఖ, ఒడిశా ఎక్సైజ్ అధికారులతో కలిసి గురువారం బందుగాం బ్లాక్‌లోని అత్తిగూడ, చైన బంకిడి, ఎగువబద్ద గ్రామాల్లో ఏకకాలంలో పెద్ద ఎత్తున దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో 10,800 లీటర్ల ఎఫ్‌జె వాష్, 40 లీటర్ల ఐడి లిక్కర్, 200 కిలోల బ్లాక్ జాగరి, 40 కిలోల అమ్మోనియాను పట్టుకొని ధ్వంసం చేశామని తెలిపారు. అక్రమ మద్యం తయారీకి సంబంధించిన క్రాస్-బోర్డర్ కార్యకలాపాల గురించి ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఈ దాడి నిర్వహించామని, ఈ పదార్థాల నుంచి ప్రమాదకరమైన నకిలీ మద్యం తయారు చేయబడి, ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని అన్నారు. అక్రమ మద్యం వ్యవస్థపై చర్యలు తీసుకోవడానికి ఈ అంతర్రాష్ట్ర ఆపరేషన్ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లోనూ ప్రజల ఆరోగ్యం, భద్రత కోసం ఇలాంటి కఠినమైన చర్యలను కొనసాగిస్తామన్నారు.

బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

సరిహద్దు ప్రాంతాల్లో మరింత విజిలెన్స్ పెంచి, అక్రమ మద్యం తయారీని పూర్తిగా నిర్మూలించడానికి ఇలాంటి సంయుక్త ఆపరేషన్లు కొనసాగిస్తామని చెప్పారు. ఈ సమన్వయ ఆపరేషన్‌లో పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి, సాలూరు ఎస్‌హెచ్ఒ బృందాలు, బిఎంపిపి సాలూరు, ఇఎస్‌టిఎఫ్ విజయనగరం, ఒడిశా ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారని తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి- సీతంపేట

తుంబకొండ గ్రామ పంచాయతీలో తుంబకొండ నుంచి సందిగూడ పిఎం జన్మన్ రూ.1.44 లక్షల నిధులతోనూ, మర్రిపాడు గ్రామపంచాయతీలో పూతికవలస ద్వారభంధం నుండి మూలగూడ వరకు పీఎం జన్మన్ నిధులు రూ.85 లక్షలతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గిరిజనులకు అండగా ప్రభుత్వం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, సీతంపేట టిడిపి మండల అధ్యకుడు సవరతోట మోఖలింగం, సీతంపేట మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మండంగి విశ్వనాథం, ఇమరక ప్రసాద్, చంద్రశేఖర్, మల్లయ్య, ప్రకాశం, డిఇ రాధారాణి, ఎంపిడిఒ టి.కృష్ణారావు, మాజీ ఎంపిపి మాలయ్య, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

మలేరియా నివారణకు స్ప్రేయింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా నివారణకు ఆల్ఫా సైపెర్ మెత్రిన్ 5శాతం స్ప్రేయింగ్ తప్పనిసరిగా చేయాలని మొండెంఖల్ వైద్య అధికారిని బి.ప్రజ్ఞ అన్నారు. మండలంలోని ఏగులవాడ పంచాయతీలో గల ఛీడిమానుగూడ గిరిజన గ్రామంలో జరుగుతున్న స్ప్రేయింగ్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంవత్సరంలో రెండుసార్లు స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నామన్నారు. మొదట విడతగా కొన్ని గ్రామాలు రెండో విడతగా కొన్ని గ్రామాలను స్ప్రేయింగ్ చేస్తామన్నారు. స్ప్రేయింగ్‌ను ఇంటి లోపల కూడా తలుపులు కిటికీలు ముందు వెనుక భాగాలలో అటకుల పైన మిద్దెల పైన బాగా చేయించుకోవాలని దీని వల్ల దోమలు ఇంట్లోకి రాలేవని ఫలితంగా మలేరియాను నియంత్రించవచ్చని చెప్పారు. పిచికారి చేసే సమయంలో ఇంటి లోపల ఆహార పదార్థాలపై ప్లాస్టిక్ కవర్లు లేదా బట్టలను కప్పి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కేశవ, ఎ.నాగేశ్వరరావు, పి.భారతి, ఆనంద్, ఏఎన్ఎమ్ భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి ప్రజ్ఞ

రచనలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులు పాటు తెలుగు శాఖ ఆధ్వర్యంలో కథ, కవిత, పాట, రచన పై అంతర్జాల అంతర్జాతీయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి శ్రీవరం అధ్యక్షులుగా ఉండగా తెలుగు శాఖ అధ్యక్షులు రామయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. రెండు రోజులు పాటు నిర్వహించిన కార్యక్రమానికి విదేశీ నుంచి వక్తలు, స్వదేశీ విశ్వవిద్యాలయం నుంచి ఆచార్యులు, కవులు, ఉపన్యాసికులు ఎంతో మంది హాజరై జయప్రదం చేశారు. అనేక మంది వక్తలు చక్కటి ఉపన్యాసాలు అందించారు. విద్యార్థులు శ్రద్ధగా విని అవగాహన పెంచుకున్నారు.

సదస్సుకు హాజరైన అధ్యాపకులు

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్యామల

ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

ప్రజాశక్తి - మక్కువ

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి బి.శ్యామల లబ్ధిదారులను కోరారు. గురువారం హౌసింగ్ డే సందర్భంగా మక్కువలో గల లే ఔట్‌ను మండల స్పెషల్ అధికారి, ఎంపిడిఒ డిడి స్వరూపా రాణి సందర్శించారు. ఇంటి నిర్మాణ పనుల ప్రగతిని పరిశీలించారు. అలాగే అసంపూర్తి నిర్మాణాలున్న ఇంటి లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఇంటి నిర్మాణాలు వెంటనే పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా గృహ నిర్మాణ శాఖ ఎఇ సింహాచలంను ఆదేశించారు. అనంతరం మర్కొండిపుటిలో పెన్షన్ పంపిణీ, ఉపాధి పనుల్లో భాగంగా మంజూరైన ఫారం పాండ్ పనులను పరిశీలించి, వడదెబ్బకు గురికాకుండా ఉపాధి శ్రామికులకు తగు సౌకర్యాలు కల్పించాలని ఎపిఒ, ఇసిలను ఆదేశించారు.

అర్హులందరికీ పింఛన్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అర్హులైన పేదలందరికీ కూటమి ప్రభుత్వం పింఛన్లు అందించి అండగా నిలుస్తుందని కురుపాం మార్కెట్ కమిటీ చైర్మన్ కడ్రక కళావతి అన్నారు. మండలంలోని లక్కగూడలో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతినెలా ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ల డబ్బులు కుటుంబ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల గాంధీ నగర్ జంక్షన్ వద్ద సిరో మలబార్ కేథలిక్ చర్చి ఫాదర్స్, గాంధీనగర్ వీధికి చెందిన జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం మినరల్ వాటర్ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి సమీప గ్రామాల గిరిజనుల నిత్య అవసరాల నిమిత్తం వచ్చి వెళ్తుంటారని, వేసవిలో వారు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను చూసి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున చలివేంద్రాన్ని ప్రజలు వినియోగించుకొని దాహార్తిని తీర్చుకోవాలని కోరుతున్నామన్నారు.

భద్రగిరి ఆర్ఐటిఐలో ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి రెసిడెన్షియల్ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఐటిఐ చదువు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 24 లోపు https://iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎలక్ట్రీషియన్ 20, ఫిట్టర్ 20, వెల్డర్ 20, కంప్యూటర్ 48, డ్రెస్ మేకింగ్ 40 సీట్లు కేటాయించామన్నారు.

మాట్లాడుతున్న సివిల్ జడ్జి హర్షవర్ధన్

కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

కార్మికులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సాలూరు సివిల్ జడ్జి జి. హర్షవర్ధన్ అన్నారు. కార్మికులకు వారి కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాల గురించి, అసంఘటిత రంగాలలో పనిచేసే ప్రతి ఒక్క కార్మికునికి అవగాహన ఉండాలన్నారు. గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా పట్టణంలో కమ్యూనిటీ భవనంలో కార్మికులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరు ప్రాంతంలో మోటార్ కార్మికులు ఎక్కువగా ఉన్నందు వల్ల ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌తో పాటు కుటుంబ పోషణ కోసం కూడా బాధిత పరిహారం వస్తుందని ఇది చట్టంలో పొందుపరిచి ఉందని, ఇటువంటి విషయాలన్నీ కార్మికులు తెలుసుకొని అవగాహన కల్పించుకోవాలని అన్నారు. కార్మికులకు మోటారు రంగంలో ఏయే చట్టాలు ఎలా అమలు అవుతాయన్న విషయంపై ఈ కార్యక్రమంలో పాల్గొన్న సాలూరు బార్ కౌన్సిల్ అధ్యక్షులు టీ జగన్నాథం, పట్టణ సీఐ బి అప్పలనాయుడు వివరించారు. ఈ కార్యక్రమంలో సినియర్ న్యాయవాదులు జి అప్పలనాయుడు, శర్మ పాల్గొన్నారు.